క్లుప్తంగా

49 మందికి ఉద్యోగాలు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివద్ధి సంస్థ, సీడాప్, జిల్లా ఉపాధి కార్యాలయం సంయుక్త అధ్వర్యంలో ప్రభుత్వ స్థానిక డీఎల్ టీసీ/ఐటీఐ కళాశాలలో మంగళవారం నిర్వహించిన జాబ్‌మేళాలో 49 మందికి ఉద్యోగాలు కల్పించినట్టు టీఎల్‌టీసీ సహాయ సంచాలకులు ఎస్ ఉగాది రవి తెలిపారు. మొత్తం 79 మంది యువత హాజరయ్యారని, మేళాలో ఎస్ఎస్ ఇన్‌స్టుమెంట్స్, కోల్గేట్ మాప్ ఆలివ్, సుజుకి, ముత్తూట్ ఫైనాన్స్ కంపెనీల ప్రతినిధులు పాల్గొని అభ్యర్థులను ఎంపిక చేసుకున్నారని వివరించారు. కార్యక్రమంలో జిల్లా నైపుణ్యాభివృద్ధి ప్లేస్‌మెంట్ అధికారి ప్రవీణ్, నేషనల్ కెరీర్ గైడెన్స్ ప్రవీణ్ కృష్ణ, కోఆర్డినేటర్స్ పాల్గొన్నారు.

సమీక్షా సమావేశం

ఏలూరు(మెట్రో): జెడ్పీ అధికారులు, ఉద్యోగులతో జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ ప్రసాద్ సమీక్షా సమావేశం నిర్వహించారు. స్థానిక జెడ్పీ సమావేశ మందిరంలో వివిధ శాఖల ఉద్యోగులతో వివిధ అంశాలపై సెక్షన్ వారీగా చర్చించారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ సీఈఓ ఆర్ విజయ రాజు, డిప్యూటీ సీఈఓ కె.భీమేశ్వర్, ఏఓలు, సిబ్బంది పాల్గొన్నారు.

జూదరుల అరెస్ట్

దెందులూరు: మండలంలో రెండు గ్రామాల్లో జూదరులను అరెస్టు చేశామని ఎస్సై ఆర్ శివాజీ తెలిపారు. మంగళవారం గోపన్నపాలెంలో ఐదుగురిని అరెస్ట్ చేసి, రూ.5,060, వేగవరంలో నలుగురిని అరెస్ట్ చేసి, రూ.5,100 స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేపట్టామని తెలిపారు. అసాంఘిక కార్యక్రమాలు నిర్వహిస్తే సమాచారం ఇవ్వాలని, అటువంటి వారి సమాచారం గోప్యంగా ఉంచుతామని ఎస్సై చెప్పారు.

కోళ్ల వ్యర్థాల వాహనం సీజ్

పెదపాడు: పర్యావరణానికి హాని కలిగించే చికెన్ వ్యర్థాలను తీసుకెళుతున్న వాహనాన్ని మత్స్యశాఖ అధికారులు సీజ్ చేశారు. మత్స్యశాఖ సహాయ తనిఖీ అధికారి సతీష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మత్స్యశాఖ ఏడీ ఫిషరీష్ ఏడీ రాజ్‌కుమార్ నేతృత్వంలో మంగళవారం గుడిపాడు వైపు నుంచి వడ్డిగూడెంలో రోడ్డులో వెళ్తున్న కోళ్ల వ్యర్థాలను తరలిస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు మత్స్యశాఖ సహాయ తనిఖీ అధికారి మత్స్యశాఖ సహాయకులతో కలిసి వాహనాన్ని అడ్డుకున్నారు. పెదపాడు పోలీసులకు అప్పగించారు. ఈ మేరకు కేసు నమోదు చేశారు.

పేదల ఆకలి తీరుస్తున్న 'దోసెడు బియ్యం'

గణపవరం: విద్యార్థులు చదువుతోపాటు సేవా భావం, సామాజిక బాధ్యతలను పెంపొందించుకోవాలని గణపవరం ప్రభుత్వ డిగ్రీ కాలేజి ప్రిన్సిపాల్ పి.నిర్మలకుమారి అన్నారు. మంగళవారం కాలేజీలో కామర్స్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో హ్యాండ్‌ఫుల్ రైస్ కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది ఒక్కో దోసెడు బియ్యాన్ని ఇంటి వద్ద నుంచి తీసుకువచ్చి కాలేజీలో ఏర్పాటు చేసిన డ్రమ్ములో వేశారు. ఇలా పోగుపడిన బియ్యాన్ని గ్రామంలోని వృద్ధ, పేదలకు అందిస్తామని చెప్పారు. ప్రతి నెలా ఒక రోజున ఈ కార్యక్రమం నిర్వహిస్తూ.. వచ్చిన బియ్యాన్ని పేదలకు పంచుతామన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ మధురాజు, అధ్యాపకులు టి.అక్కిరాజు, స్వరూపరాణి, వెంకటరమణ, వెంకట్రావు, శారదాదేవి పాల్గొన్నారు.

నేటి నుంచి గ్రామాల్లో సామాజిక తనిఖీలు

ద్వారకాతిరుమల: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంపై మండలంలోని గ్రామాల్లో బుధవారం నుంచి విడతల వారీగా సామాజిక తనిఖీలు నిర్వహించనున్నట్టు ఆ పథకం జిల్లా విజిలెన్స్ అధికారి కె.పురుషోత్తం తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం తనిఖీ బృందంతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పురుషోత్తం మాట్లాడుతూ సిబ్బంది సమన్వయంతో 16వ విడత సామాజిక తనిఖీలను పటిష్టంగా నిర్వహించాలన్నారు. సమావేశంలో ఈఓ పీఆర్డీ ఏవీ సుబ్బరాయన్, సోషల్ ఆడిట్ స్టేట్ రిసోర్స్ పర్సన్ టి.నందిని, సోషల్ ఆడిట్ డీఆర్పీలు, మండలం ఉపాధి హామీ పథకం సిబ్బంది పాల్గొన్నారు.

కూలీల ఉపాధికి ధీమా

- లక్ష్యానికి దగ్గరగా ఉపాధి హామీ పనులు
- వైఎస్సార్ సీపీ హయాంలో రూ.27.56 కోట్లతో ప్రణాళిక
- రూ.8.50 కోట్లు అందుకున్న కూలీలు
- మరో రూ.11 కోట్ల మెటీరియల్ పేమెంట్ మంజూరు



ప్రత్తికోళ్లలంకలో మట్టి పనులు చేస్తున్న కూలీలు



మాల్కాపురంలో పంట బోదె తవ్వుతున్న కూలీలు (ఫైల్)

ఏలూరు రూరల్: ఏలూరు రూరల్ మండలంలో కష్టజీవుల శ్రమ ఫలించింది. వైఎస్సార్ సీపీ హయాంలో అధికారులు రూపొందించిన ఉపాధి హామీ పథకం ప్రణాళిక సత్ఫలితాలు ఇస్తుంది. ఈ ఏడాది తొమ్మిది నెలల కాలంలోనే కూలీలు రికార్డు స్థాయిలో 3,25,602 పని దినాలు పూర్తి చేశారు. ఫలితంగా వేతనాల రూపంలో రూ.8.50 కోట్లు అందుకున్నారు. సుమారు రూ.11 కోట్ల సామగ్రి పేమెంట్ రూపంలో కేంద్ర ప్రభుత్వం అందించనుంది. ఈ నిధులతో గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టేందుకు మార్గం సుగమమైంది.

పక్కా ప్రణాళికతో కూలీలకు మేలు

వైఎస్సార్ సీపీ హయాంలో ఏలూరు మండల అధికారులు పెద్ద ఎత్తున ఉపాధి హామీ పథకంలో పనులు చేపట్టేందుకు ప్రణాళిక రూపొందించారు. ఇందుకోసం ఏకంగా రూ.27.56 కోట్లతో లేబర్ బడ్జెట్ తయారు చేశారు. 8849 కుటుంబాలకు 100 రోజులు పని కల్పించాలని నిర్ణయించారు. ప్రణాళికలో భాగంగా 2024 ఏప్రిల్ 1వ తేదీ నుంచి చాటపర్రు, కోటేశ్వరదుర్గాపురం, మొండికోడు, గుడివాకలంక, కొక్కిరాయిలంక, ప్రత్తికోళ్లలంక, పైడిచింతపాడు, కోమటిలంక, పెదయాగనమిల్లితో పాటు కలకుర్రు, శ్రీపర్రు, మాదేపల్లి, జాలిపూడి, కాట్లంపూడి, మల్కాపురం గ్రామాల్లో అధికారులు ఉపాధి పనులు చేపట్టారు. ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి డిసెంబర్ వరకు 3,25,602 పని దినాలు చేశారు. మరో 81,634 దినాలు చేస్తే టార్గెట్ పూర్తయినట్టేనని అధికారులు చెబుతున్నారు.

చేతినిండా పని

ఏడాదికి ఒక్కో కూలీకి కనీసం 100 రోజుల పని కల్పించాలని కేంద్రం నిర్ణయించింది. రోజుకు రూ.257 వేతనం అందుకోవచ్చు. 100 రోజులకు రూ.25,700 తమ ఖాతాలో జమ చేసుకోవచ్చు. గతేడాది ఒక్కో కూలీ సుమారు 80 రోజులు పని చేశారు. ఇప్పుడు ఆ సంఖ్య 100కు చేరాలని అధికారులు భావిస్తున్నారు. ఇందుకోసం గ్రామాల్లో పంట కాల్వ, తాగునీటి చెరువులు, డ్రెయిన్లలో పూడిక తీత పనులు పెద్ద ఎత్తున చేపట్టనున్నారు.

టార్గెట్ పూర్తి చేస్తాం

ఈ ఏడాది రూపొందించిన లేబర్ బడ్జెట్ కూలీలకు చేతినిండా పని కల్పించింది. దాదాపుగా కూలీలు అందరికీ పని కల్పించాం. ఇప్పటికే టార్గెట్ 95 శాతం పూర్తి చేశాం. మరో 4 నెలలు సమయం ఉంది. ఈ సమయంలో మిగిలిన పని దినాలు సైతం పూర్తి చేస్తాం. కూలీలు పెద్ద ఎత్తున పని చేయడం వల్ల కేంద్ర ప్రభుత్వం మెటీరియల్ పేమెంట్ రూపంలో రూ.11 కోట్లు విడుదల చేస్తుంది. ఈ నిధులతో అభివృద్ధి పనులకు సైతం ప్రణాళిక రూపొందించాం.

– విజయ్, ఇంజినీరింగ్ కన్సల్టేట్, ఏలూరు రూరల్

ఏసు మార్గం అనుసరణీయం



క్యాండిల్ లైట్ సర్వీస్‌లో నిర్వహిస్తున్న దృశ్యం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): విశ్వశాంతి, లోక కల్యాణం కోసం ప్రతి ఒక్కరూ ఏసు ప్రభువు సూచించిన మార్గంలో నడవాలని బైబిల్ వండర్స్ టీవీ వర్తమానికులు జాన్ వెస్లీ పిలుపునిచ్చారు. నగరానికి చెందిన మన్నా చర్చి పాస్టర్ ఎం జ్యోతిరాజు ఆధ్వర్యంలో స్థానిక గ్జేవియర్ నగర్‌లోని సెయింట్ గ్జేవియర్ పాఠశాలలో నిర్వహించిన క్రిస్మస్ ఆరాధన పండుగల్లో ఆయన ప్రధాన వక్తగా ప్రసంగించారు. ప్రపంచ మానవాళి అంతా సుఖ సంతోషాలతో జీవించాలని, ప్రతి ఒక్కరూ సాటి వారిని ప్రేమించడం ద్వారా ప్రభువుకు చేరువకావచ్చని వివరించారు. సేవామార్గంలో పయనించి ప్రతి ఒక్కరినీ సోదర భావంతో ఆదరించడం ద్వారా సౌభ్రాతృత్వాన్ని పెంపొందించవచ్చని చెప్పారు. తొలుత కేక్ కట్ చేశారు. అనంతరం క్యాండిల్ లైట్ సర్వీస్ నిర్వహించారు. మన్నా చర్చి క్వయర్ బృందం మధురమైన ఏసుప్రభువు స్తుతి కీర్తనలు ఆలపించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే బడేటి చంటి, ఎస్ఎంఆర్ పెదబాబు, బిషప్ ఎం ఎలీషా రాజు తదితరులు పాల్గొన్నారు.

ఇంధన పొదుపుతో మంచి భవిష్యత్

జేసీ ధాత్రిరెడ్డి



ఇంధన పొదుపు ర్యాలీలో పాల్గొన్న అధికారులు, ప్రజాప్రతినిధులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఇంధనాన్ని పొదుపు చేయడం ద్వారా భావితరాలకు మంచి భవిష్యత్ ఇవ్వవచ్చని జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి అన్నారు. జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాల్లో భాగంగా మంగళవారం స్థానిక కలెక్టరేట్ నుంచి ఫైర్ స్టేషన్ సెంటర్ మీదుగా ఆర్‌ఆర్‌పేటలోని విద్యుత్ భవన్ వరకు నిర్వహించిన ర్యాలీని ఆమె ఎమ్మెల్యేలు బడేటి రాధాకృష్ణయ్య, చింతమనేని ప్రభాకర్‌లతో కలిసి జెండా ఊపి ప్రారంభించారు. ఇంధన పొదుపుపై అవగాహన కలిగించే పోస్టర్లు, కరపత్రాలను ఎమ్మెల్యేలు, జేసీ విడుదల చేశారు. ఈ సందర్భంగా ధాత్రిరెడ్డి మాట్లాడుతూ ఇంధన వనరుల పరిరక్షణ బాధ్యత ప్రతి ఒక్కరిదని అన్నారు. ప్రజల్లో ఇంధన పొదుపుపై అవగాహన కలిగించేందుకు విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో ఈనెల 20 వరకు పొదుపు వారోత్సవాలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఎమ్మెల్యే బడేటి చంటి మాట్లాడుతూ ఇంధన పొదుపుపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ మాట్లాడుతూ డబ్బును పొదుపు చేసుకునే విధంగానే విద్యుత్‌ను కూడా అవసరాల మేరకు వాడుకోవాలని సూచించారు. ఈపీడీసీఎల్ ఏలూరు ఎస్ఈ పి.సాల్మన్ రాజు మాట్లాడుతూ విద్యుత్ వినియోగంపై గ్రామాల్లో జానపద కళాకారులు, జనవిజ్ఞాన వేదిక కార్యకర్తలతో విస్తృతంగా ప్రచారం చేస్తున్నట్టు చెప్పారు. విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖనం, స్వయం సహాయ సంఘాల మహిళా బృందాలతో ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నామని వివరించారు. కార్యక్రమంలో ఎలక్ట్రికల్ డీఈ కేఎం అంబేద్కర్, డీఈపీ పి.రాజకుమారి, ఏఈ పి.ప్రసన్నవల్లి, డీఈఈ బీవీ కృష్ణరాజు, జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి ఎస్ఎస్ కృపావరం, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆదర్శ మహిళా ఉద్యమ నేత రాజకుమారి



రాజకుమారి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మహిళా నాయకులు

ఏలూరు (టూటౌన్): ఆదర్శ మహిళా ఉద్యమ నేత చంద్ర రాజకుమారి అని ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య ఏలూరు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పరక శ్యామల, మన్నవ యామిని కొనియాడారు. ఆంధ్రప్రదేశ్ మహిళా సమైఖ్య ఏలూరు జిల్లా సమితి ఆధ్వర్యంలో స్థానిక కొత్తపేట కాలనీలో రాజకుమారి ఆరో వర్ధంతి సభ మంగళవారం మహిళా సమైఖ్య ఏలూరు జిల్లా అధ్యక్షురాలు పరకా శ్యామల అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా యామిని మాట్లాడుతూ రాజకుమారి అఖిల భారత మహిళా సమైఖ్య ఉపాధ్యక్షురాలుగా, సీపీఐ జాతీయ కౌన్సిల్ సభ్యురాలిగా, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలిగా పనిచేసిన మహనీయురాలని కొనియాడారు. మహిళలు ఆర్థికంగా మెరుగుపడాలని మహిళా మండలిని స్థాపించి, అందులో కుట్టు మెషీన్లు, మగ్గం వర్క్ నేర్పించే వారని తెలిపారు. మహిళల అభివృద్ధికి ఎనలేని సేవలు అందించారని వివరించారు. కార్యక్రమంలో సావిత్రి, లక్ష్మి, దుర్గ, సరస్వతి, పార్వతి, రంగమ్మ, రాణి, తదితరులు పాల్గొన్నారు.

పాత పెన్షన్ విధానాన్నే కొనసాగించాలి



జాతీయ పెన్షనర్స్ దినోత్సవంలో పాల్గొన్న నాయకులు, సిబ్బంది

ఏలూరు (టూటౌన్): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కొత్త పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్నే కొనసాగించాలని ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు బండి వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. స్థానిక కోటదిబ్బ సర్వీస్ రిజర్వాయర్ వన్ వద్ద మంగళవారం ఉదయం 43వ జాతీయ పెన్షనర్స్ దినోత్సవాన్ని ది జోనల్ మున్సిపల్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎ.అప్పలరాజు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు, ఏఈ సాయి, ఇన్‌స్పెక్టర్ సీహెచ్ హరినాథ్ బాబు, యూనియన్ కోశాధికారి బి.నారాయణరావు తదితరులు మాట్లాడారు. జాతీయ, యూనియన్ పతాకాలను ఆవిష్కరించారు. మొక్కలు నాటారు. దేవి, మధ్యాహ్నపు దుర్గారావు, ఏలూరు నగరపాలక సంస్థ ఎస్ఈ రాజేంద్ర కృష్ణ, డీఈఈ రజాక్, యూనియన్ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉత్సాహంగా సైక్లోథాన్



కార్యక్రమంలో పాల్గొన్న బడేటి వెంకట్రామయ్య, శిక్షకులు



సైకిల్ రైడింగ్‌లో పాల్గొన్న క్రీడాకారులు

ఏలూరు రూరల్ : ఫిట్ ఇండియా ప్రతి ఒక్కరిలో స్ఫూర్తి నింపుతుందని భారత వెయిట్‌లిఫ్టింగ్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ బడేటి వెంకట్రామయ్య అన్నారు. మంగళవారం ఏలూరులో స్టేట్ లెవెల్ ఖేలో ఇండియా సెంటర్ (సాయ్) ఆధ్వర్యంలో సైకిల్ రైడింగ్ నిర్వహించారు. స్థానిక అల్లూరి సీతారామరాజు స్టేడియం వద్ద జరిగిన ప్రారంభ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రతిరోజూ సైక్లింగ్ చేయడం వల్ల శారీరక పట్టుత్వంతో పాటు మానసిక ప్రశాంతత వస్తుందని చెప్పారు. ప్రధాన మంత్రి ప్రారంభించిన ఫిట్ ఇండియా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ప్రతి ఒక్కరూ ఆటలు, వ్యాయామంపై దృష్టి పెట్టాలన్నారు. ప్రతిరోజూ కనీసం 30 నిమిషాలు వ్యాయామం చేయాలని సూచించారు. సాయ్ ఇన్‌చార్జి వినాయక్ ప్రసాద్ ఫిట్ ఇండియా కార్యక్రమంలో భాగంగా ప్రజలకు ఆరోగ్యం, వ్యాయామం పట్ల అవగాహన కల్గించేందుకు సైకిల్ రైడింగ్ నిర్వహించామని తెలిపారు. క్రీడాకారులు, యువతీ, యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారని చెప్పారు. క్రీడాకారులు ఏలూరు అల్లూరి సీతారామరాజు స్టేడియం నుంచి పాతబస్టాండ్, వసంత్‌మహల్, ఫైర్‌స్టేషన్ సెంటర్‌కు చేరుకుని తిరిగి పవర్‌పేట స్టేషన్ మీదుగా స్టేడియంకు సైకిల్ రైడింగ్ చేరిందని తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్న వారిని శిక్షకులు ఉదయ్ సందీప్, ప్రీతిచౌదరి, శ్రీనివాస్ తదితరులు అభినందించారు.

మన్యంపై చలి పంజా

- పడిపోతున్న ఉష్ణోగ్రతలు
- ఉదయం దట్టమైన పొగమంచు
- మధ్యాహ్నం కూడా వీస్తున్న చలి గాలులు



కమ్మేసిన దట్టమైన పొగమంచు



అలివేరులో చలి మంట వేసిన గిరిజనులు

బుట్టాయగూడెం: పశ్చిమ ఏజెన్సీ ప్రాంతంలో చలి పులి పంజా విసురుతుంది. గత కొద్ది రోజులుగా తీవ్రమైన చలిగాలులు వీస్తున్నాయి. తుపాను ప్రభావంతో మధ్యాహ్నం కూడా గాలులు వీస్తున్నాయి. సాయంత్రం నాలుగు గంటల నుంచే చలి గాలులు ప్రజలను వణికిస్తున్నాయి. రాత్రి సమయంలో చలి గాలులు తీవ్రంగా వీస్తున్నాయి. ఇప్పుడే పరిస్థితి ఈ విధంగా ఉంటే జనవరి నెలలో చలి తీవ్రత ఎలా ఉంటుందో అని గిరిజన ప్రాంత ప్రజలు ఆందోళన చెందుతున్నారు. అర్ధరాత్రి నుంచి మొదలవుతున్న పొగ మంచు ఉదయం తొమ్మిది గంటల వరకు తగ్గడంలేదు. ఉదయం, సాయంత్ర సమయాల్లో బయటకు రావాలంటే ప్రజలు చలికి భయపడిపోతున్నారు. అత్యవసరమైతే తప్ప ఇళ్లల్లో నుంచి బయటకు రావడంలేదు. గత కొద్దిరోజులుగా ఏజెన్సీ ప్రాంతంలో వీస్తున్న చల్లని గాలులు వల్ల రోజురోజుకూ ఉష్ణోగ్రతలు తగ్గుతున్నాయి. గ్రామాల్లో చలి తట్టుకోలేక రాత్రి, ఉదయం పూట ప్రజలు చలి మంటలు వేసుకుని చలి నుంచి ఉపశమనం పొందుతున్నారు. స్వెటర్లు, మంకీ క్యాప్‌లు ధరిస్తూ చలి నుంచి కాపాడుకుంటున్నారు. ఉదయం పూట బయట ప్రాంతంలో 17 డిగ్రీలు ఉష్ణోగ్రత నమోదు కాగా, కొండప్రాంతాల్లో 15 నుంచి 14 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి.

అభివృద్ధిలో భాగస్వాములు కావాలి

గణపవరం: గ్రామాల అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, ప్రణాళికాబద్ధంగా పనిచేస్తూ గ్రామాలను అభివృద్ధి పథంలో నిలపాలని కోర్సు డైరెక్టర్, ఏపీఎస్ఐఆర్‌డీ (విజయవాడ) జీవీ రమణ అన్నారు. మంగళవారం గణపవరం మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని సర్పంచ్‌లు, సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులకు, స్థానిక ప్రతినిధులకు ఇస్తున్న శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సుస్థిర అభివృద్ధి ప్రణాళికలు రూపొందించుకుని ముందుకు సాగాలన్నారు. ఎల్ఎస్‌డీఎస్ పథకం, ప్రజారోగ్య లక్ష్యాలు, హెల్దీ విలేజ్, చైల్డ్ ఫ్రెండ్లీ విలేజ్, సురక్షిత మంచినీరు తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఎంపీడీఓ బీబీ శ్రీలక్ష్మి, ఈవోపీఆర్డీ సత్యనారాయణ, పీహెచ్‌సీ సీహెచ్ఓ జాలాది విల్సన్, రిసోర్స్ పర్సన్లు పాల్గొన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న సభ్యులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు.

కృష్ణా కాలువ డీసీల ఎన్నిక ఏకగ్రీవం

పెదపాడు: కృష్ణా కాలువ పెదపాడు వట్లూరు డీసీ అధ్యక్ష, ఉపాధ్యక్షుడుల, ఇతర కార్యవర్గాన్ని మండల ప్రత్యేక అధికారి కె.అనూరాధ సమక్షంలో మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పెదపాడు, వట్లూరు డీసీలకు నూతన కార్యవర్గాన్ని పెదపాడు మండల పరిషత్ కార్యాలయంలో ఎన్నుకున్నారు. నాయకులు లావేటి శ్రీనివాసరావు, గుత్తా అనీల్, తహసీల్దార్ ఎ.కృష్ణజ్యోతి, ఎంపీడీఓ పాల్గొన్నారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్ఈఎల్ (ఇంద్ర)	21.00	35
ఏలూరు –బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.00	39
ఏలూరు – బీహెచ్ఈఎల్ (స్టార్ లైనర్ నాన్ఏసీ స్లీపర్)	22.30	15
ఏలూరు – తిరుపతి(ఇంద్ర)	19.00	35

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు – బీహెచ్ఈఎల్	21.45	4820	31
ఏలూరు – బీహెచ్ఈఎల్	21.15	4822	27
ఏలూరు – బీహెచ్ఈఎల్ వయా కే.కోట	19.30	4796	31
ఏలూరు –బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	29
ఏలూరు–జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	32
ఏలూరు–బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	20.30	4800	30
ఏలూరు – బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	33
ఏలూరు – ఈసీఐఎల్	22.30	4814	23
ఏలూరు – తిరుపతి	16.00	4830	29

కష్టపడి చదివితేనే ఫలితం



పాఠశాలలో రికార్డులను పరిశీలిస్తున్న డీఈఓ

చింతలపూడి : కష్టపడి చదివితేనే ఫలితం ఉంటుందని జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటలక్ష్మమ్మ విద్యార్థులకు సూచించారు. చింతలపూడి మండలం రేచర్ల గ్రామంలో ఎంపీయూపీ పాఠశాలను మంగళవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. చదువుతో పాటు సాంకేతిక నైపుణ్యాలు నేర్చుకోవాలని సూచించారు. ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకుని నిరంతరం సాధన చేయాలన్నారు. విద్యార్థుల ఆరోగ్యం పట్ల ఉపాధ్యాయులు శ్రద్ధ వహించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా డీఈఓ పాఠశాలలో రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. మధ్యాహ్న భోజనంపై విద్యార్థులను ఆరా తీశారు. భోజనం మెనూ వివరాలను హెచ్ఎం రాజేంద్ర, ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు.

చేపల పెంపకంతో సాగునీటి కొరత

కొయ్యలగూడెం: మండలంలోని బోడిగూడెం గ్రామ శివారు రాయుడు చెరువును చేపల పెంపకానికి లీజుకు ఇవ్వడంతో రెండో పంటకు నీరు సరిపోవడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ చెరువు ద్వారా రబీ సీజన్‌కి కూడా నీరు సరఫరా అయ్యే విధంగా ఇరిగేషన్ శాఖ కృషి చేయాలని కోరారు. రాయుడు చెరువు ఆయకట్టుదారులు మంగళవారం సమావేశమయ్యారు. 18 ఎకరాల గర్భం గల చెరువు ద్వారా దాదాపు 40 ఎకరాల వరకు సాగునీరు అందుతోందన్నారు. ఫిబ్రవరి నుంచి చేపల పెంపకం లీజుదారుడు నీరును వదిలి వేయడం వల్ల పంటకు సరిపోవడంలేదని, పశువులకు దాహార్తి సమస్య ఏర్పడుతుందని వివరించారు. సమస్యను ఇరిగేషన్ శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లగా ఒక పంటకు మాత్రమే నీరు సరఫరా అయ్యే విధంగా నిబంధనలు ఉన్నట్టు చెబుతున్నారని తెలిపారు. చెరువుల నీరు సాగు అవసరాలకు, రజక వృత్తికి మాత్రమే ఉపయోగించే విధంగా పంచాయతీ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమస్యపై ఇప్పటికే ఏలూరు కలెక్టరేట్లో వినతి పత్రం అందజేశామని రైతు మిరియాల మనోహర్ తెలిపారు. 70 ఏళ్ల క్రితం మూడు వర్గాలకు చెందిన రైతులకు మాన్యాలు పేరిట వ్యవసాయ భూములను ప్రభుత్వం ఇచ్చిందని, అప్పటి నుంచి సాగు చేసుకుంటుండగా చేపల పెంపకం పేరిట చెరువులో నీరు లేకుండా చేస్తున్నారని ఆరోపించారు. పైగా లీజుదారుడు రైతులను హెచ్చరించే విధంగా గ్రామంలో టాంటాం వేయించాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశంలో జక్కు ధర్మరాజు, జక్కు చెల్లారావు, చదలవాడ అబ్రహాం, చిడిపి వెంకన్నబాబు, జక్కు రామ దుర్గారావు, బోగోలు వెంకన్న, రాఉరి రామలక్ష్మి, జక్కు సుబ్బలక్ష్మి, బోగోలు రామలక్ష్మి, పేరుబోయిన సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.